బస్సు ఎక్కలేకపోతున్నాం..

- విద్యార్థులకు ఆర్టీసీ బస్సు కష్టాలు
- అరకొరగా బస్సు సర్వీసులు
- కళాశాలకు వెళ్లేందుకు అవస్థలు పడుతున్న విద్యార్థులు
- తప్పనిసరి పరిస్థితుల్లో ఫుట్‌బోర్డుపై నిల్చొని ప్రయాణం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు



పూసపాటిరేగలో ఆర్టీసీ బస్సు కోసం విద్యార్థుల పడిగాపులు

పూసపాటిరేగ: విద్యార్థులకు ప్రయాణ అవస్థలు తప్పడం లేదు. ఆర్టీసీ బస్సు సర్వీసులు తక్కువగా ఉండడంతో కిక్కిరిసి ప్రయాణం చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఉదయం కళాశాలకు వెళ్లేటప్పుడు..సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చేటప్పుడు బస్సు ఫుట్‌బోర్డుపై ప్రమాదకరంగా ప్రయాణించాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పిల్లలకు ఏమైనా(ప్రమాదం) అయితే గానీ స్పందించరా అని అటు అధికార యంత్రాంగాన్ని, ఇటు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. తక్షణమే బస్సుల సంఖ్య పెంచాలని, అవసరమైతే విద్యార్థుల కోసం కొన్ని ప్రత్యేక బస్సులు నడపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉదయం, సాయంత్రం రద్దీ..

సాధారణ ప్రయాణికులతో పాటు విద్యార్థుల రాకపోకలు ఎక్కువగా ఉండే ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సు నిలుపుదల చేసే ప్రాంతాలు అత్యంత రద్దీగా కనిపిస్తాయి. ఈ నేపథ్యంలో ఆయా సమయాల్లో వీలైనన్ని ఎక్కువ బస్సులు నడపాలని, అలా అయితే విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు ఉండవు. ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 10 గంటలు, సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు పూసపాటిరేగ కూడలి నుంచి రణస్థలం, చింతపల్లి, తిప్పలవలస, భోగాపురం వైపు వెళ్లే బస్సుల్లో ప్రయాణించాలంటే నరకయాతన పడాల్సి వస్తోంది. ఇదిలా ఉంటే బస్సుల కొరత కారణంగా గంటల కొద్దీ బస్సుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి. ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉందని ఒక బస్సును వదిలేస్తే తర్వాతి బస్సు కోసం గంట కాలం వరకు వేచి చూడాలి. ఈ క్రమంలో కళాశాలకు సమయం అయిపోతోందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బస్సు దొరికినా సీటు దొరకదు..

పూసపాటిరేగలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో 5 వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరితో పాటు పనులకు వెళ్లే వారు, క్యాంపులు వెళ్లే వారు, పరిశ్రమల్లో పనిచేసే వారు ఇలా నిత్యం గ్రామాల నుంచి ఇక్కడికి బస్సుల్లో రావాలి. వారందరికీ సరిపడా బస్సులు లేకపోవడంతో వారు కూడా ఇబ్బందులు పడుతున్నారు. బస్సు దొరికితే.. సీటు దొరకదు.. సీటు దొరికితే గాలి ఆడదు అనే రీతిలో వ్యవహారం తయారైందని అందరూ అభిప్రాయపడుతున్నారు.

రోజూ నిల్చొని ప్రయాణిస్తున్నా..

ప్రతిరోజూ పూసపాటిరేగలోని కళాశాలకు బస్సులో వస్తున్నా. ప్రతిసారి బస్సులో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటోంది. దీంతో సీటు దొరక్క రోజూ బస్సులో నిల్చొని ప్రయాణిస్తున్నా. కొంతమంది అయితే ఫుట్‌బోర్డుపై వేలాడుతూ ప్రయాణిస్తున్నారు. లేదంటే సమయానికి కళాశాలకు వెళ్లలేం. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సు సర్వీసులు పెంచాలి.

–డి.అఖిల్, విద్యార్థి, పూసపాటిరేగ

బస్సు సర్వీసులు పెంచాలి..

సరిపడ బస్సు సర్వీసులు లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి, కొత్త బస్సులు వేయాలి. పదే పదే ఆర్టీసీ అధికారులను కోరుతున్నా ప్రయోజనం లేకుండా పోతోంది. ప్రభుత్వమే విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవాలి.

కె.చైతన్య, విద్యార్థి, కామవరం

ఎమ్మెల్యే నాగమాధవికి సారిపల్లి గ్రామస్తుల ఝలక్..



ఎమ్మెల్యేకు సమస్యలపై ఏకరువు పెడుతున్న తారకరామతీర్థ సాగర్ ప్రాజెక్టు నిర్వాసితులు

నెల్లిమర్ల రూరల్: ప్రజలతో మన ఎమ్మెల్యే కార్యక్రమం పేరిట నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి చేపడుతున్న గ్రామ పర్యటనల్లో ఆమెకు చేదు అనుభవాలు ఎదురవుతున్నాయి. గెలిచిన నాటి నుంచి ఆమె నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టిసారించకపోవడాన్ని నిలదీస్తున్నారు. శనివారం సారిపల్లి గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు, కూటమి నాయకులు ఝలక్ ఇచ్చారు. గ్రామంలో నెలకొన్న ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే ముందు ఏకరువు పెట్టారు. నిర్మాణంలోని తారకరామతీర్థ సాగర్ ప్రాజెక్టును పరిశీలించేందుకు వెళ్లిన ఆమెను నిర్వాసితులు కలిసి తమ సమస్యల చిట్టా విప్పారు. రిజర్వాయర్ నిర్మాణంతో జీవనోపాధి కోల్పోయిన తమకు పీఏఎఫ్ ప్యాకేజీ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రిజర్వాయర్ గట్టు నిర్మాణంతో గ్రామం నుంచి నెల్లిమర్లకు వెళ్లే రహదారి బంద్ అవుతుందని, గట్టు స్వరూపం మార్చాలన్నారు. సాగునీటి చెరువులు రిజర్వాయర్‌లో మునిగిపోవడంతో ఉపాధి పనులు పూర్తి స్థాయిలో కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి నేతలతో సహా స్థానిక ప్రజలు తమ సమస్యల చిట్టా విప్పడంతో చేసేదేమీ లేక అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చి ఎమ్మెల్యే అక్కడి నుంచి వెనుదిరిగారు. ఏది ఏమైనా ఎమ్మెల్యే హామీలో స్పష్టత, ఆమె ఇచ్చిన మాటపై నమ్మకం కొరవడడంతో గ్రామస్తులంతా ఆమె తీరుపై మండిపడుతున్నారు. ఈ హామీ అయినా నెరవేరుస్తారో లేదో చూడాలని అంటున్నారు. కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు గోపాలమూర్తి, కొరటాన రాము, భాస్కరరావు, గజపతిరాజు, నాగేష్, భానూజీ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లిమర్ల: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రేఖా కందుల ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. విజయనగరం సంస్కృత కళాశాల నుంచి నెల్లిమర్ల ద్వామా కార్యాలయానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల తరలించడం జరిగిందని, ఈ ఏడాది నుంచి కొత్తగా బీఎస్సీ, బీకాం, బీఏ కోర్సులు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. బీఎస్సీలో బీఎస్సీ కంప్యూటర్స్, కంప్యూటర్ సైన్స్, మ్యాథ్స్, ఫిజిక్స్, బోటనీ, జూవాలజీ, కెమిస్ట్రీ కోర్సులు ఉన్నాయని, బీకాంలో కంప్యూటర్ అప్లికేషన్స్..బీఏలో పొలిటికల్ సైన్స్, హిస్టరీ, ఎకనామిక్స్ కోర్సులు ఉన్నాయన్నారు. కళాశాలలో అన్ని కోర్సులకు సంబంధించి మొత్తం 280 సీట్లు ఉండగా 157 మంది విద్యార్థులు ఇప్పటివరకు కళాశాలలో చేరారన్నారు. ఇంకా ఆన్‌లైన్‌లో మూడో విడత కౌన్సెలింగ్‌కు అవకాశం ఉందని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తరగతి గదులు తక్కువగా ఉన్నందున బీఏ, బీకాం విద్యార్థులకు ఉదయం..బీఎస్సీ విద్యార్థులకు మధ్యాహ్నం తరగతులు ఉంటాయన్నారు. అదనపు తరగతి గదుల కోసం ఐసీడీఎస్ కార్యాలయం కావాలని ఉన్నతాధికారులకు నివేదిస్తామని, ప్రభుత్వ డిగ్రీ కళాశాల కోసం వేణుగోపాలపురం డైట్ ఎదురుగా ఉన్న 5 ఎకరాలు కేటాయించినట్లు తెలిపారు.

క్లుప్తంగా

ఘనంగా ఫ్రెషర్స్ డే



ఆకట్టుకున్న విద్యార్థిని నృత్య ప్రదర్శన

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఫ్రెషర్స్ డే, ముందస్తు దీపావళి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పలువురు విద్యార్థులు చేసిన నృత్యాలు, నాటికలు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ పీకే మహంతి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలకు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిని తరలించండి



డీఎంఈ రఘునందన్‌తో మాట్లాడుతున్న వెంకటరమణ

విజయనగరంఫోర్ట్: వైద్య కళాశాల ఆవరణలోకి ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిని తరలించాలని ఉత్తరాంధ్ర అంబేడ్కర్ ఐట్స్ నాయకులు పాండ్రంకి వెంకటరమణ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన జిల్లా పర్యటనకు విచ్చేసిన డీఎంఈ(వైద్యవిద్య సంచాలకులు) డాక్టర్ జి.రఘునందన్‌ను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. అసంపూర్తిగా ఉన్న భవనాల నిర్మాణం పూర్తి చేయించి, అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.

కార్మిక వ్యతిరేక విధానాలు తిప్పికొట్టాలి



గౌతమ్‌రెడ్డిని కలిసిన లక్ష్మణరావు

నెల్లిమర్ల రూరల్: కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు తిప్పికొట్టాలని వైఎస్సార్ సీపీ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్‌రెడ్డి పిలుపునిచ్చారు. విజయవాడలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో తనను శనివారం మర్యాదపూర్వకంగా కలిసిన ఆ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి దవళ లక్ష్మణరావుతో కాసేపు ముచ్చటించారు. కార్మికవర్గాల కష్టనష్టాలపై ప్రభుత్వంతో పోరాడాలని, కార్మికులకు న్యాయం జరిగేలా కృషి చేయాలని గౌతమ్‌రెడ్డి సూచించారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి



సిబ్బందికి సూచనలిస్తున్న ఎన్టీఆర్ ట్రస్ట్ ఆరోగ్యశ్రీ కో–ఆర్డినేటర్ సాయి

డెంకాడ: ప్రజలకు 104 వాహనం ద్వారా మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎన్టీఆర్ ట్రస్ట్ ఆరోగ్యశ్రీ కో–ఆర్డినేటర్ డాక్టర్ సాయి, జిల్లా ఇన్‌చార్జ్ నరసింహమూర్తి సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని మోపాడ పీహెచ్‌సీ పరిధిలోని జొన్నాడ పంచాయతీలో ఉన్న దువ్వపేటలో 104 వాహనం ద్వారా అందిస్తున్న వైద్య సేవలను వారు శనివారం పరిశీలించారు. ఎప్పుడు ఏ గ్రామం వెళ్తున్నారు..రోజుకు ఎంతమందికి ఆరోగ్య తనిఖీలు చేస్తున్నారన్న విషయాలపై ఆరాతీశారు. కార్యక్రమంలో డీఈవో సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీ అభివృద్ధికి కృషి

విజయనగరం ఫోర్ట్: రెడ్‌క్రాస్ సొసైటీ అభివృద్ధికి సభ్యులంతా కృషి చేయాలని సొసైటీ చైర్మన్ కేఆర్‌డీ ప్రసాదరావు కోరారు. స్థానిక రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో మేనేజింగ్ కమిటీ సమావేశం శనివారం జరిగింది. ఆయన మాట్లాడుతూ సొసైటీ ద్వారా నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోందని, ముున్ముందు కూడా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. సమావేశంలో సొసైటీ వైస్ చైర్మన్ రాజగోపాల్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

120 మందికి ఆరోగ్య తనిఖీలు

డెంకాడ: మండల కేంద్రంలో విజయనగరానికి చెందిన దాట్ల ఆస్పత్రి వారు శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 120 మందికి ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు రొంగలి కనకసింహాచలం, వైఎస్సార్ సీపీ నాయకుడు దాట్ల సత్యన్నారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు దీపావళి వేడుకలు



ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శన

విజయనగరం అర్బన్: స్థానిక ఫోర్ట్‌సిటీ స్కూల్‌లో ముందస్తుగా దీపావళి వేడుకలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ నృత్య ప్రదర్శనలతో చూపరులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ కేవీపీ రాజు, వైస్ చైర్మన్ చంటి, ప్రిన్సిపాల్ రోయినాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



నెల్లిమర్ల: పరిసరాలు శుభ్రం చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



డెంకాడ: పరిసరాల్లోని చెత్తాచెదారం ఏరివేస్తున్న ఏపీఎస్పీ బెటాలియన్ అధికారులు

నెల్లిమర్ల: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని, ప్రతిఒక్కరూ తమ చుట్టుపక్కల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని నగరపంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, కమిషనర్ టి.జయరాం సూచించారు. మండల కేంద్రంలో శనివారం జరిగిన స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న వారు..పరిసరాల పరిశుభ్రతపై ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. పరిసరాల పరిశుభ్రతతోనే సమాజ ఆరోగ్యమని, అందరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని తెలిపారు.

డెంకాడ: మండలంలోని చింతలవలస ఐదో ఏపీఎస్పీ బెటాలియన్‌లో స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్ సీహెచ్‌వీఎస్ పద్మనాభరాజు ఈ కార్యక్రమంలో పాల్గొని, పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ అదనపు కమాండెంట్ జీవీ ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం: మండల కేంద్రంలో స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర ర్యాలీ శనివారం చేపట్టారు. ఎంపీడీవో స్వరూపరాణి ఈ కార్యక్రమంలో పాల్గొని, పరిసరాల పరిశుభ్రతకు ప్రతిఒక్కరూ పాటుపడాలని కోరారు.

జనాభా ప్రాతిపదికన కులగణన చేయాలి

విజయనగరం టౌన్: జనాభా ప్రాతిపదికన కులగణన చేసి, రిజర్వేషన్ శాతం పెంచాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ కులాల ఐక్యవేదిక నాయకులు చోడి ఆదినారాయణ, రొంగలి రామారావు, అబ్దుల్ కరీమ్ డిమాండ్ చేశారు. స్థానిక ఐక్యవేదిక కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని, పలు అంశాలపై చర్చించారు. రాష్ట్రంలోని 136 కులాలు ఉన్నప్పటికీ నాలుగైదు కులాలు మాత్రమే రాజ్యాధికారంలో భాగమై ఉన్నాయన్నారు. వందలాది కులాలు ఇప్పటికీ చట్టసభల గడప తొక్కని పరిస్థితి ఉందన్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లుకు దేశంలోని ప్రజాప్రతినిధులంతా చట్టసభల్లో మద్దతివ్వాలని విజ్ఞప్తి చేశారు.

మానవదేహాల గుర్తింపులో డీఎన్ఏ కీలకం



శాస్త్రవేత్త మధుసూదన్‌రెడ్డిని సన్మానిస్తున్న వీసీ మహంతి

నెల్లిమర్ల రూరల్: ప్రకృతి విపత్తులు, వివిధ ప్రమాదాల్లో మృతులెవరనే(మానవదేహాలు) విషయం తెలుసుకునేందుకు డీఎన్ఏ చాలా కీలకమని హైదరాబాద్ సీడీఎఫ్‌డీ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు డీఎన్ఏపై శనివారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో ఎన్ని కోట్ల మంది ఉన్నప్పటికీ ప్రతి మనిషికీ డీఎన్ఏ వేర్వేరుగా ఉంటుందన్నారు. డీఎన్ పరీక్షలు చేయడంలో సవాళ్లు కూడా ఎదురవుతుంటాయని, ఫోరెన్సిక్ విద్యార్థులు ఈ అంశాలపై పట్టు సాధించాలని తెలిపారు. అనంతరం వర్సిటీ ప్రతినిధులంతా ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ పీకే మహంతి, అధ్యాపకులు రవికుమార్, హైరాక్ దాస్, జోగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా..ఉత్సాహంగా..!

మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఉల్లాసంగా ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల విద్యార్థులంతా ఈ పోటీల్లో పాల్గొని తమ సత్తా చాటుతున్నారు. ప్రతిరోజూ జరుగుతున్న ఈ క్రీడాపోటీలకు రోజుకో అధికారి హాజరై క్రీడాకారులను ఉత్తేజపరుస్తూ పలు సూచనలు చేస్తున్నారు. ఒక్క చదువులోనే కాదు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలని, క్రీడల్లో విశేష ప్రతిభ కనబరిచిన ఎంతోమంది ఉన్నత స్థానాలకు చేరారని స్ఫూర్తి నింపారు. ఇక్కడి పోటీల్లో గెలుపొందిన వారు డివిజన్ స్థాయి పోటీల్లో బాగా రాణించాలని ఆకాంక్షించారు.

–విజయనగరం, పూసపాటిరేగ



విజయనగరం: కబడ్డీ ఆడుతున్న విద్యార్థినులు



పూసపాటిరేగ: హోరాహోరీగా జరుగుతున్న కబడ్డీ పోటీని తిలకిస్తున్న క్రీడాకారులు, ఇతరులు

వైఎస్సార్ సీపీలో కొత్త నియామకాలు

విజయనగరం: వైఎస్సార్ సీపీ బలోపేతమే లక్ష్యంగా పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీలో పలు విభాగాల్లో కొత్త నియామకాలు చేపట్టారు. విజయనగరం జిల్లా సోషల్ మీడియా విభాగం ఉపాధ్యక్షులుగా నెల్లిమర్లకు చెందిన మలుకుర్తి శ్రీనివాసరావు, చీపురుపల్లికి చెందిన కెల్ల సురేష్‌లు నియమితులు కాగా ప్రధాన కార్యదర్శులుగా ఎస్.కోటకు చెందిన పల్లంటి శ్రావణ్‌కుమార్, గజపతినగరానికి చెందిన ముల్లు తాతినాయుడు, విజయనగరానికి చెందిన కనిశెట్టి సుధాకర్, బొబ్బిలికి చెందిన పోలా తవిటి నాయుడు, నెల్లిమర్లకు చెందిన బాకి వెంకట కనకారావులు నియమితులయ్యారు. జిల్లా కార్యదర్శులుగా విజయనగరానికి చెందిన కసిరెడ్డి నవీన్, బొబ్బిలికి చెందిన బేరి బుజ్జిప్రసాద్, నెల్లిమర్లకు చెందిన పిల్లా చిరంజీవి, విజయనగరానికి చెందిన సైలాడ శ్రీహరిబాబు, గజపతినగరానికి చెందిన వేమలి శ్రీనివాసరావు, ఎస్.కోటకు చెందిన కర్రి దేముడుబాబు, చీపురుపల్లికి చెందిన సాసాపు ప్రకాష్‌లు నియమితులయ్యారు. వీరితో పాటు ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా మరో 16 మందిని నియమించారు.

నెల్లిమర్ల వైఎస్సార్ సీపీలో..

పూసపాటిరేగ: నెల్లిమర్ల వైఎస్సార్ సీపీ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి వివిధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కార్యాలయం నుంచి శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. యువజన విభాగం అధ్యక్షుడిగా బడ్డుకొండ ప్రదీప్‌నాయుడు, మహిళా విభాగం అధ్యక్షురాలిగా రౌతు వెంకటరత్నం, రైతు విభాగం అధ్యక్షుడిగా ఎస్.సత్యనారాయణరాజు, బీసీ సెల్ అధ్యక్షుడిగా కోరాడ కోటినాయుడు, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా పచ్చిపాల గురునాథరావు, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా లండ పాపారావు, క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా షేక్ భాషా, పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షుడిగా బడ్డుకొండ రమేష్, ఆర్టీఐ విభాగం అధ్యక్షుడిగా గంట్రేటి గణేష్, వలంటీర్స్ వింగ్ అధ్యక్షుడిగా నడుపూరు వెంకటేష్, గ్రీవెన్స్ సెల్ విభాగం అధ్యక్షుడిగా మహంతి శ్రీనివాసరావు, వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా మత్స సత్యనారాయణ, చేనేత విభాగం అధ్యక్షుడిగా కనకం సురేష్, అంగన్‌వాడీ విభాగం అధ్యక్షుడిగా అలమండ మేరీ, లీగల్ సెల్ అధ్యక్షుడిగా నడిపేన సత్యం, కల్చరల్ విభాగం అధ్యక్షుడిగా తర్లాడ రామస్వామినాయుడు, సోషల్ మీడియా అధ్యక్షుడిగా శీరపు అప్పలనారాయణ, ఐటీ వింగ్ అధ్యక్షుడిగా కర్రి రాము, వైద్యుల విభాగం అధ్యక్షుడిగా గురాన అప్పారావు, బూత్ కమిటీ వింగ్ అధ్యక్షుడిగా సారిక గౌరీశంకర్, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడిగా కోట్ల పైడినాయుడు నియమితులయ్యారు.

మండలాల వారీగా నియామకాలివే..

పూసపాటిరేగ: నెల్లిమర్ల నగరపంచాయతీ సహా నెల్లిమర్ల, పూసపాటిరేగ, డెంకాడ, భోగాపురం మండలాల వైఎస్సార్ సీపీలో వివిధ పదవుల్లో పలువురు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. నెల్లిమర్ల నగరపంచాయతీ వైస్ ప్రెసిడెంట్‌గా నల్లి శ్రీను, ప్రధాన కార్యదర్శులుగా సారిపల్లి కృష్ణ, తుమ్ము నారాయణమూర్తి, మహంతి అప్పలనాయుడు, సముద్రపు రామారావు, కార్యదర్శులుగా మద్దిల రామారావు, బోలి సన్యాసప్పడు, ఇడదేశి శ్రీను, బేపల సురేష్, కీర్తి లక్ష్మణరావు, కోరాడ ఆదినారాయణ, కోశాధికారిగా బుగత శ్రీను నియమితులు కాగా నెల్లిమర్ల మండల వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షులుగా చనుమల్ల తులసి, అంబల్ల కిరణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శులుగా పంచాది శ్రీరాములునాయుడు, సారిపల్లి గురునాథరావు, లెంక గోవిందరావు, గుంటమాని రాజబాబు, పాలూరి తరుపతిరావు, కార్యదర్శులుగా తర్లాడ దుర్గారావు, నేతేటి సన్యాసప్పడు, బొంతు పురుషోత్తంనాయుడు, అట్టాడ శ్రీను, నడుపూరి పరుసనాయుడు, కంది శ్రీను, మొయిద రాంబాబు, మజ్జి గణేష్ నియమితులయ్యారు. ఇదిలా ఉంటే డెంకాడ మండల వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షుడిగా బమ్మిడి వెంకటరమణ, సరగడ బంగార్రెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా బడ్డుకొండ శంకర్‌ప్రసాద్, బాలి సత్యనారాయణ, రొంగలి గోపాలకృష్ణ, తొత్తిడి శ్రీనివాసరావు, కార్యదర్శులుగా వెంపడాపు రమణ, పాండ్రంకి ఆదినారాయణ, త్రిపురగిరి మురళి, అట్టాడ సత్తిబాబు నియమితులయ్యారు. అలాగే భోగాపురం మండల వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షులుగా బైరెడ్డి ప్రభాకరరెడ్డి, పడాల భానుప్రకాష్, ప్రధాన కార్యదర్శులుగా దాట్ల శ్రీనివాసరాజు, కిలారి వెంకటరమణ, వాసుపల్లి రెయ్యిడు, అడపా ప్రసాదరావు, కార్యదర్శులుగా నడుపూరు నర్సింహనాయుడు, చిత్ర ఆనందరావు, శీరపు గురునాథరెడ్డి, పతివాడ రామకృష్ణ, కొల్లి రామ్మూర్తి నియమితులయ్యారు. పూసపాటిరేగ మండల వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షులుగా వాసుపల్లి అప్పన్న, దారపు లక్ష్మణరెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా అప్పారావు, ఎడ్ల రామకృష్ణ, కాంతాటి శ్రీనివాసరావు, మొంగం నాగబాబు, కార్యదర్శులుగా గుజ్జు సురేష్‌రెడ్డి, తాటిశెట్టి సూర్యనారాయణ, పిన్నింటి ఎల్లంనాయుడు, పతివాడ సూరిబాబు, బందపు రామారావులు నియమితులయ్యారు. వీరితో పాటు ఆయా మండలాలకు ఎగ్జిక్యూటివ్ మెంబర్లను కూడా నియమించారు.

బాధ్యతల స్వీకరణ

భోగాపురం: మండల సర్వేయర్‌గా శివాజీ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన జిల్లా కేంద్రంలో సర్వేయర్‌గా విధులు నిర్వహించి, బదిలీపై ఇక్కడకు వచ్చారు. మండల సర్వేయర్‌గా ఇక్కడ విధులు నిర్వహించిన ముదికేశ్వరరావు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆయన స్థానంలో శివాజీ మండల సర్వేయర్‌గా ఇక్కడకు వచ్చారు.

ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలి

నెల్లిమర్ల: రైతులంతా తాము పండిస్తున్న పంటలకు సంబంధించి ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీఏ కోటేశ్వరరావు సూచించారు. మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏవో శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం జరిగిన ఏఈవోలు, వీఏఏల సమావేశానికి హాజరైన ఆయన అన్ని రకాల పంటలకు ఈ–క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయాలన్నారు. అలాగే అగ్రికల్చర్, నాన్ అగ్రికల్చర్ డేటా కూడా నమోదు చేయాలన్నారు.

డైట్ దారిలో జంగిల్ క్లియరెన్స్



రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలు తొలగిస్తున్న దృశ్యం

నెల్లిమర్ల: స్థానిక డైట్ రహదారిలో పోలీసుల ఆధ్వర్యంలో శనివారం జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు. స్థానిక యువత సహకారంతో ఎస్ఐ గణేష్ ఈ దారిలో రోడ్డుకు ఇరువైపులా దట్టంగా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించారు. గురుకుల పాఠశాల వద్ద కూడా పిచ్చిమొక్కలు తొలగించి, పరిసరాల పరిశుభ్రత చేపట్టారు. రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా ఈ జంగిల్ క్లియరెన్స్ చేపట్టినట్లు ఆయన తెలిపారు.

కొత్తపేటలో కోటి సంతకాల సేకరణ



ప్రజలు చేసిన సంతకాల పత్రాలు చూపిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నెల్లిమర్ల రూరల్: ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ మండల వ్యాప్తంగా చాలా చురుగ్గా కొనసాగుతోంది. కొత్తపేటలో సర్పంచ్ అట్టాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం జరిగిన ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ప్రజలే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కరపత్రాలపై సంతకాలు చేసి, వైఎస్సార్ సీపీ ప్రజా ఉద్యమానికి మద్దతు తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రభుత్వమే నడపాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు.

శతశాతం ఏఆర్‌టీ రిజిస్ట్రేషన్ చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డీఎల్‌వో రాణి

విజయనగరం ఫోర్ట్: ఏఆర్‌టీ రోగులకు సంబంధించి శతశాతం ఏఆర్‌టీ రిజిస్ట్రేషన్ జరగాలని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ కె.రాణి తెలిపారు. స్థానిక జిల్లా ఎయిడ్స్ నియంత్రణ శాఖ కార్యాలయంలో ఎయిడ్స్ నియంత్రణ శాఖ సిబ్బందితో శనివారం సమావేశమై ఆమె మాట్లాడారు. హెచ్ఐవీ నిర్ధారణ పరీక్షల సంఖ్యను పెంచాలని తెలిపారు. ఐసీటీసీ సెంటర్లకు వచ్చే రోగులకు హెచ్ఐవీ పరీక్ష గురించి అవగాహన కల్పించి, అంగీకరించిన మీదట పరీక్షలు చేయాలన్నారు. టీబీ రిఫరల్స్ కూడా పెంచాలన్నారు. సిబ్బంది పనితీరు మెరుగు పర్చుకోవాలన్నారు. ఐసీటీసీ సెంటర్లలో ఎస్‌టీఐ పరీక్షలు చేయాలన్నారు. అనంతరం హెచ్ఐవీపై రుపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు.